తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ

భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి

బుధవారం 03 డిసెంబర్ 2025 | పేజీలు : 8

Follow :


## తెలంగాణ ఎన్నికల కోడ్‌లో రూ 50 వేలు దాటితే ఆధారాలు చూపాల్సిందే : నరేష్



**మణుగూరు, డిసెంబర్ 02 (జనంసాక్షి):** స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ అమలులో భాగంగా ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ప్రజలు నగదుతో ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో రూ . 50 వేలకు మించి నగదు రవాణా చేస్తే వాటికి సంబంధించిన సరైన పత్రాలు లేకుండా వెళితే ఇబ్బంది పడే అవకాశం ఉందని మణుగూరు మండల తహసిల్దార్ అద్దంకి నరేష్ తెలిపారు. కోడ్ అమలులో ఉన్న విషయం చాలా మందికి తెలియక సాధారణ పరిస్థితుల మాదిరిగా నగదుతో ప్రయాణం చేస్తే అధికారులు పట్టుకుని సీజ్ చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. పక్కా ఆధారాలతోనే రూ.50 వేలకు మించి నగదును తీసుకువెళ్లాలని సూచించారు. తనిఖీ కేంద్రాల వద్ద సరైన ఆధారాలు చూపించకపోతే ఆ నగదును సీజ్ చేస్తామని తెలిపారు.

**రూ. 50 వేలకు మించి నగదు రవాణా చేయకూడదు**

తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలలో కోడ్ అమలులో ఉన్నందున రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి వద్ద రూ. 50 వేలు నగదు మాత్రమే తీసుకెళ్లేందుకు అనుమతి ఉంటుంది. పెళ్లిళ్ళు, కళాశాల ఫీజులు, అత్యవసర వైద్యం, వ్యాపార నిమిత్తం పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్లేవారు సరైన ఆధారాలు దగ్గర ఉంచుకొని తనిఖీ చేసే అధికారులకు చూపాల్సి ఉంటుంది. అలా చూపని పక్షంలో ఆ నగదును అధికారులు సీజ్ చేసే అవకాశం ఉంటుంది. ఒకవేళ తనిఖీ చేసే సమయంలో మీ వద్ద ఆధారాలు చూపలేక పోయినా తర్వాత ఈ పత్రాలను చూపిస్తే జప్తు చేసిన నగదును తిరిగి ఇస్తారు. ఎలక్షన్ కోడ్ సమయంలో నగదు రవాణాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### ప్రీ మెట్రిక్స్ స్కాలర్షిప్ కొరకు దరఖాస్తు చేసుకునేలా

## హెచ్ఎంలు సహకరించాలి

**ఎం ఇ ఓ లావురి బాలు నాయక్**



**మిర్యాలగూడ, డిసెంబర్ 02,(జనంసాక్షి)** ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్ కోసం దరఖాస్తు చేసుకునేలా ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు సహకరించాలని మండల విద్యాధికారి లావూరి బాలు నాయక్ కోరారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న అర్హులైన ఎస్సీ,ఎస్టీ, బీసీ విద్యార్థులు ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్ కొరకు దరఖాస్తులు చేయుటకు అర్హులన్నారు.ఐదో తరగతి నుండి 8వ తరగతి వరకు బాలురకు వేయి రూపాయలు, బాలికలకు 1,500 రూపాయలు అదేవిధంగా 9, 10వ తరగతి విద్యార్థులకు 3,500 స్కాలర్షిప్ మంజూరు అవుతుందన్నారు.కావున కులం, ఆదాయం మరియు బ్యాంకు ఎకౌంటును విద్యార్థు లతో తీయించి ఆన్లైన్ చేసే విధంగా హెడ్మాస్టర్లు ప్రోత్సహించగలరని కోరారు. అదేవిధంగా పాఠశాలకు వచ్చిన పుస్తకాలు,యూనిఫార్మ్ ఆన్లైన్ చేయవలసిందిగా ఆదేశించారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మంగ్య నాయక్, వేణుధర్,రాఘవరెడ్డి శ్రీను,నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరం

**ఎస్పీ కె.నరసింహ**



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** మద్యం తాగి ఖాళీ సీసాలు కాలువలు, పంట పొలాల్లో వేయడం వల్ల పొలం పనులు, మందు వేసే సమయాల్లో వెళ్తున్న రైతులకు,కూలీలకు గాయాలు అవుతున్నాయని, దీనిపై చాలా వినుతులు వస్తున్నాయని జిల్లా ఎస్పీ కె.నరసింహ మంగళవారం ప్రకటనలో తెలిపారు.బహిరంగంగా మద్యం సేవిస్తూ కల్వర్టులు, పంట పొలాల్లో ఖాళీ మద్యం సీసాలు పడవేయడం మంచి పౌరుల లక్షణం కాదని అన్నారు.కొన్ని సందర్భాల్లో పాఠశాలల్లో కూడా మద్యం సీసాలు వేస్తున్న సంఘటనలు పోలీసు దృష్టికి వస్తున్నాయని తెలిపారు.ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలన్నారు. పంట పొలాల్లో గాజు సీసాలు వేయవద్దని అన్నారు.బహిరంగంగా మద్యం తాగే వారి వల్ల వచ్చిపోయే మహిళలు, పిల్లలు ఇబ్బందులు పడుతారని అన్నారు.బహిరంగంగా మద్యం తాగడం నేరమని, బహిరంగ మద్యం తాగే వారిపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.నిర్మానుష ప్రాంతాలు, క్రీడా మైదానాలు,ఖాళీ ఇంటి స్థలాలు, కాలువ గట్ల వద్ద పోలీసు పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఇలాంటి వారిపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

### అయ్యప్ప స్వామికి మాలధారణ స్వాముల

## భక్త నీరాజనం

3

## బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరిక

**కోదాడ,( జనంసాక్షి):** అనంతగిరి మండలం అజ్మీర తండా గ్రామం నుండి బిఆర్ఎస్ పార్టీ నాయకులు అజ్మీర బాలకృష్ణ సతీమణి శ్రీదేవి,తో పాటు పలువురు గ్రామానికి చెందిన కార్యకర్తలు, నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లుగా తెలిపారు. ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సారథ్యంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు బుర్ర పుల్లారెడ్డి, బానోత్ బాబు నాయక్, గ్రామ శాఖ అధ్యక్షులు అజ్మీర రమేష్ బాబు, అజ్మీర సాగర్ ,భూక్య సైదులు, అజ్మీర సైదులు,భూక్య కిషన్, కోటేశ్వరరావు ,ప్రతాప్, పవన్, అశోక్, గోపి ,సూరి పలువురు నాయకులు ఉన్నారు.



## బంగారుగడ్డ గ్రామ సర్పంచ్ పదవి ఏకగ్రీవంపై తక్షణ విచారణ,చర్యలు చేపట్టాలి

### తెలంగాణ స్టేట్ ఎలక్షన్ కమిషన్ కి వినతి పత్రం

**చండూరు మండలం డిసెంబర్ 2 (జనంసాక్షి)** నల్గొండజిల్లా చండూరు మండలం. బంగారుగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవిని రూ.73 లక్షలకు వేలంపాట చేసిన ఘటనపై తక్షణ విచారణ మరియు చర్యలు చేపట్టవలెనని బంగారుగడ్డ కు చెందిన ఓటరు తీగల అశోక్ కుమార్ తెలంగాణ స్టేట్ ఎలక్షన్ కమిషన్ కు వినతి పత్రం అందజేశారు.బంగారుగడ్డ గ్రామంలో ఇటీవల సర్పంచ్ పదవిని అక్షరాల రూ.73 లక్షలకు వేలంపాట చేసినట్లు గ్రామ ప్రజల్లో చర్చ జరుగుతోంది.అదేవిధంగా నిన్న గ్రామంలోని వార్డ్ సభ్యులను బలవంతంగా ఏకగ్రీవం చేయడం, కొంతమందికి డబ్బులు ఇవ్వడం, కొంతమందిని బెదిరించడం, ఎన్నికల ప్రక్రియను ప్రభావితంచేసే చర్యలు చేపట్టడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. ఇవన్నీ భారత రాజ్యాంగం, పంచాయతీ రాజ్ చట్టాలు, ఎన్నికల నియమావళి, ప్రజాస్వామ్య సూత్రాలకు పూర్తిగా విరుద్ధమైన చర్యలు.మా గ్రామంలో గత అనేక సంవత్సరాలుగా తాగునీటి కొరత, వీధి దీపాల లేకపోవడం, మౌలిక వసతుల లేమి వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రజలు తమ ప్రజాస్వామ్య హక్కు అయిన ఓటు హక్కును వినియోగించి ప్రజాప్రతినిధిని ఎన్నుకోవాల్సిన సందర్భంలో కొంతమంది వ్యక్తులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎన్నికలను వేలంపాటగా మార్చడం చాలా తీవ్రమైన నేరం.ఈ చట్టవ్యతిరేక చర్యలు గ్రామ ప్రజాస్వామ్య హక్కులను హరింపజేస్తున్నాయి.ఓటర్ల అభిప్రాయాలను పూర్తిగా విస్మరిస్తున్నాయి.
ఎన్నికల ప్రక్రియను భంగం కలిగిస్తున్నాయి.
అందువల్ల నా వినతులు క్రింది విధంగా ఉన్నాయి:
1.బంగారుగడ్డ గ్రామంలో సర్పంచ్ పదవి వేలంపాటలో పాల్గొన్న లను తక్షణమే గుర్తించి చట్టపరమైన చర్యలు
తీసుకోవాలి.
2.సర్పంచ్ పదవిని ఏకగ్రీవంగా ప్రకటించే అన్ని అనుచిత ప్రయత్నాలను నిలిపి వేయాలి. మరియుగ్రామంలో స్వేచ్ఛా, నిష్పక్షపాత ప్రజాస్వామ్య ఎన్నికలు జరగాలని చర్యలు



తీసుకోవాలి.
3.భవిష్యత్తులో ఇటువంటి చట్టవిరుద్ధ వేలంపాటలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలి అని పేర్కొన్నారు.

### అధికార పార్టీ నేతలు కోడ్ ఉల్లంఘిస్తుంటే

# ఎన్నికల కమిషన్ మౌనంగా ఉంది

**కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఓడితేనే 6గ్యారంటీలు సరిగ్గా ప్రజలకు అందుతాయి**

**బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలిస్తేనే ప్రజల పక్షాన పోరాడతారని**

**బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి**

**నేరేడుచర్ల (జనంసాక్షి) :**
ఎన్నికల కోడ్ ను అధికార పార్టీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి తో సహా అందరూ కూడా ఉల్లంఘిస్తుంటే ఎలక్షన్ కమిషన్ మాత్రం మౌనం వహిస్తుంది. ఓటమి భయంతో స్వయానా సీఎం రేవంత్ రెడ్డి సభలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలంటూ పిలుపునియ్యడం శోచనీయం గా ఉందని నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి అన్నారు.. మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమీక్ష సమావేశం.పాల్గొన్న నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి మాట్లాడుతు రాజకీయ చరిత్రలో సర్పంచ్ ఎన్నికలకు సీఎం ప్రచారం చేయడం నేనింత వరకు చూడలేదని అన్నారు, ఓటమి భయంతో సీఎం రేవంత్ రెడ్డి సభలు సమావేశాలు ఏర్పాటు చేసి సర్పంచ్ ఎన్నికల్లో ప్రచారం చేస్తున్నారని, యదేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తు చేసి ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు చేస్తుంటే ఈసీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, బిజెపి



కాంగ్రెస్ పార్టీ రెండు కుమ్మక్కై రాజకీయాలు చేస్తున్నాయని,బయటకు మాత్రం వేరువేరని ఆత్మలు మాత్రం ఒకటేనని ఆరోపించారు.కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి, ఇద్దరూ కూడా రేవంత్ రెడ్డికి సహకరిస్తూ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు చేశారు.కాంగ్రెస్ పార్టీకి ప్రజాక్షేత్రంలో వ్యతిరేకత ఎదురు కావడంతో స్వయంగా మంత్రులు ఎమ్మెల్యేలు గడపగడప తిరుగుతూ ప్రచారం చేస్తున్నారని, బిఆర్ఎస్ అభ్యర్థులు గెలిస్తేనే ప్రజల పక్షాన పోరాడుతారని అన్నారు....ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అరిబండి సురేష్ బాబు, డిసిసిబి డైరెక్టర్ అప్పిరెడ్డి,మాజీ మున్సిపల్ ఛైర్మన్ చందమల్ల జయ బాబు,మాజీ ఎంపీపీ చెన్న బోయిన సైదులు,పట్టణ,మండలం కార్యదర్శులు చిత్త లూరి సైదులు, ఎల్లబోయిన లింగయ్య, మాజీ గ్రంథాలయ ఛైర్మన్ గుర్రం మార్కండేయ, బిఆర్ఎస్ నాయకులు, కె. ఎల్.రెడ్డి, వస్కుల సుదర్శన్,ఇంజామూరి రాములు, సైదిరెడ్డి,జెట్టి వెంకన్న,నందిపాటి గురవయ్య, ఇంజామూరి రాజేష్, పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు,



### కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి

# భారీగా చేరికలు

**చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో గులాబీ తీర్థం పుచ్చుకున్న కాంగ్రెస్ శ్రేణులు**

**రామన్నపేట, డిసెంబర్ 2 (జనంసాక్షి):**
మండలంలోని బోగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కూనూరు సాయికుమార్ గౌడ్ తో పాటు కాంగ్రెస్ పార్టీ కి చెందిన 50 కుటుంబాలు బీఆర్ఎస్ మండల నాయకులు అంతటి రమేష్ గౌడ్ సారథ్యంలో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే గులాబి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మోసపూరిత మాటలతో అమలు కానీ హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కేసీఆర్ పరిపాలనను చూసి ఓర్వలేక మభ్యపెట్టే మాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్, ఆనాడు కెసిఆర్ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలు తప్ప కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమీ లేదని అన్నారు. కాంగ్రెస్ మాట తప్పే విధానాన్ని తట్టుకోలేక అభ్యర్థులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ గ్రామాన ఓటమి పాలవడం ఖాయమని, మళ్లీ రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### భారీ జనసందోహం మధ్య

# మారేపల్లి నామినేషన్

**అవకాశం ఇస్తే ప్రజల రుణం తీర్చుకుంటా**

**కొమ్మాయిగూడెం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మారేపల్లి మల్లారెడ్డి**

**రామన్నపేట, డిసెంబర్ 2 (జనంసాక్షి):**
తనకు ఓట్లు వేసి గెలిపిస్తే కొమ్మాయిగూడం ప్రజలకు సేవకుడిగా ఉంటానని, గ్రామ సమస్యలు తన సమస్యలుగా భావించి సమస్యలు తీరుస్తానని గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మారేపల్లి మల్లారెడ్డి తెలిపారు. మంగళవారం భారీ జన సందోహంతో ర్యాలీగా కొమ్మాయి గూడెం గ్రామం నుండి బయలుదేరి రామన్నపేట గ్రామపంచాయతీ వద్ద నామినేషన్ వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలతో కలిసి గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు. ప్రజలకు అందరికీ అందుబాటులో ఉండి సేవ చేయడానికి తాను ముందుంటానని వారు పేర్కొన్నారు.ఈ ఎన్నికల్లో తమకు అవకాశం ఇచ్చి ఓటు వేసి గెలిపించాలని ఎల్లప్పుడు తాను ప్రజలకు ఓటర్లకు రుణపడి ఉంటానని తెలిపారు. నామినేషన్ కార్యక్రమంలో కొమ్మాయిగూడం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





### ఈనెల 7న గ్యాస్ట్రో న్యూరో సమస్యలకు

# ఉచిత వైద్య శిబిరం

**సూర్యాపేట ఐఎంఏ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రామ్మూర్తి యాదవ్**

**సూర్యాపేట(జనంసాక్షి):**
ఈ నెల 7న జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలో గల వినూత్న న్యూరో, గ్యాస్ట్రో హాస్పిటల్ లో సూర్యాపేట ఐఎంఏ ట్రస్ట్, సూర్యాపేట ఐఎంఏ ఆధ్వర్యంలో న్యూరో, గ్యాస్ట్రో సమస్యలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సూర్యాపేట ఐఎంఏ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రామ్మూర్తి యాదవ్ తెలిపారు.మంగళవారం వినూత్న హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో అవసరమైన వారికి ఖర్చుతో కూడిన ఎండోస్కోపీ, కొలనోస్కోపీ, ఫైబ్రో స్కాన్ వంటి వైద్య పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు.గ్యాస్ట్రో, న్యూరో సమస్యలతో బాధపడే వారికి స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.త్వరలో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణకు స్క్రీనింగ్ టెస్టులు, 9 నుండి 14 సంవత్సరాల లోపు బాలికలు క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా ముందస్తు వాక్సిన్ అందించనున్నట్లు తెలిపారు.షుగర్, బీపీ తదితర వ్యాధులతో బాధపడే వారికి కూడా స్పెషలిస్ట్ డాక్టర్లచే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సూర్యాపేట పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో సూర్యాపేట ఐఎంఏ ట్రస్ట్ సెక్రటరీ డాక్టర్ రామకృష్ణ, సూర్యాపేట ఐఎంఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఆనంద్, డాక్టర్ రమేష్ నాయక్, డాక్టర్ ఉదయ్ కుమార్, డాక్టర్ రిజ్వాన్ మహమ్మద్, హాస్పిటల్ మేనేజ్మెంట్ నగేష్, మధుకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేట బీఎస్పీ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా నకిరేకంటి నరేష్



**రామన్నపేట, డిసెంబర్ 2 (జనంసాక్షి):**
రామన్నపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా బీఎస్పీ మండల అధ్యక్షులు నకిరేకంటి నరేష్ మంగళవారం రామన్నపేటలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడినుండి ర్యాలీగా నామినేషన్ కేంద్రం వరకు బిఎస్పి పార్టీ నియోజకవర్గ జిల్లా అధ్యక్షులు తో కలిసి భారీ ప్రదర్శన నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇచ్చిన ఆయుధం ఓటు హక్కు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఒక ప్రకటనలో నరేష్ కోరారు. నామినేషన్ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు గూని రాజు, పావురాల నరసింహ యాదవ్, గ్యార మారయ్య, నోముల రాజు తదితరులు పాల్గొన్నారు.



# అయ్యప్ప స్వామికి మాలధారణ స్వాముల భక్త నీరాజనం



- వైభవంగా అయ్యప్పకు మహా పడిపూజ మహోత్సవం
- గురుస్వామి యర్రంశెట్టి ఉపేందర్ ఆధ్వర్యంలో అయ్యప్పకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు





**సూర్యాపేట (జనంసాక్షి):**
సూర్యాపేట జిల్లా కేంద్రంలో శ్రీ ధర్మశాస్త్ర హరిహర పుత్ర అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవాన్ని అయ్యప్ప భక్త రత్న, నిత్యాన్నదాన ప్రదాత యర్రంశెట్టి ఉపేందర్ గురుస్వామి 18వ నారికేళ పడి సందర్భంగా ఘనంగా కన్నుల పండుగగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత వైభవంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అమ్మ గార్డెన్స్ ఎదురుగా 60 ఫీట్ల రోడ్డులో అయ్యప్ప స్వామి, విఘ్నేశ్వర స్వామి, సుబ్రహ్మణ్యస్వామిలకు ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి బ్రహ్మశ్రీ వేణు మాధవ శర్మ రాజగురు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి 18 మెట్ల పడిపూజను కన్నుల పండుగగా అశేష భక్తజనం నడుమ అయ్యప్ప మాలధారణ స్వాముల భజలు పాటలతో పడిపూజ మహోత్సవాన్ని నిర్వహించారు. ప్రముఖ గాయకులు మధుప్రియ, రేలారే రేలా గంగా, సునీల్, కుమార్ గురుస్వామి పాల్గొని అయ్యప్ప స్వామి భక్తి పాటలు ఆలపించడంతో పాటు భక్తులను భక్తిపారవశ్యంలో ముంచేత్తారు. ఈ సందర్భంగా మాలధారణ స్వాములు అయ్యప్ప స్వామి భజనలు కీర్తనలతో అయ్యప్ప కు నీరాజనాలు పలికారు. అనంతరం మాల ధారణ స్వాములకు, భక్తులకు అల్పాహార వితరణ చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా యర్రంశెట్టి ఉపేందర్ గురుస్వామి మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా మాలధారణ చేస్తూ అయ్యప్ప స్వామి భక్తుడిగా మాల ధారణ సమయంలో ఎంతో మంది స్వాముల సేవలో ఉంటూ అన్నదాన వితరణ చేయడం జరిగింద న్నారు. అయ్యప్ప స్వామిపై తనకున్న భక్తిని చాటుకునేందుకు తన 18వ పడి సందర్భంగా ఈ పడిపూజ మహోత్సవాన్ని తెలంగాణ రాష్ట్రం లోనే గొప్పగా సూర్యాపేటలో నిర్వహించాలని తలచి నిర్వహించినట్లు తెలిపారు. అయ్యప్ప స్వామి కరుణ కటాక్షాలు ప్రజలందరిపై ఉండా లని మాలధారణ దీక్ష స్వాముల కోరికలు నెంవేరాలని మనస్ఫూర్తిగా అయ్యప్పను వేడుకున్నట్లు తెలిపారు. అయ్యప్ప మహా పడిపూజ మహోత్సవంలో పాల్గొని విజయవంతం చేసిన అయ్యప్ప మాలధారణ స్వాములకు భక్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో యర్రంశెట్టి సాకేత్ వర్మ, పట్టణానికి చెందిన ప్రముఖులు, గురుస్వాములు, మాలధారణ స్వాములు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పోరాడే సీపీఐ(ఎం) నే గెలిపించాలి

- పైరవీకారులకు పెత్తనం ఇస్తే జేబులు గుల్లే
- సర్పంచ్ అభ్యర్థులు ప్రకటించిన సీపీఐ(ఎం)



**కారేపల్లి, డిసెంబర్ 02 (జనంసాక్షి) :**
ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సీపీఐ(ఎం) అభ్యర్ధులనే గెలిపించాలని సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. మంగళవారం కారేపల్లిలో మండల కమిటీ, ముఖ్య కార్యకర్త సమావేశం కేసగాని ఉపేందర్ అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో భూక్యా వీరభద్రం మాట్లాడుతూ స్థానికం ఏ సమస్య వచ్చినా సీపీఐ(ఎం) నాయకత్వం ముందుండి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. పోడు భూములు, స్థానిక సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. సీపీఐ(ఎం) తోనే పేదలకు ప్రభుత్వ పధకాలు, పారదర్శక సాధ్యమని గతంలో నిరూపితం చేసిందన్నారు. పైరవీకారులకు పెత్తనం ఇస్తే గ్రామాల్లో కయ్యాలు పెట్టటం జేబులు నింపుకోవటం చేస్తారని ప్రజలు దానిని గుర్తేరిగి అందరికి అందుబాటులో ఉండే సీపీఐ(ఎం) అభ్యర్ధులను గెలిపించాలని కోరారు.

**సీపీఐ(ఎం) అభ్యర్ధుల ప్రకటన**
సింగరేణి మండలంలో సీపీఐ(ఎం) పోటీ చేస్తున్న గ్రామపంచాయతీలకు అభ్యర్ధులను ప్రకటించారు. బాజుమల్లాయిగూడెంకు బచ్చల స్వర్ణలత, పాటిమీదిగుంపు సూరబాక ధనమ్మ, చీమలపాడు అజ్మీర జ్యోతి, బోటితండా బానోత్ కిషన్, ఎర్రబోడు వజ్జా లక్ష్మి, గాదెపాడు భూక్యా లక్ష్మన్, కోమట్లగూడెం ఈసం లక్ష్మి, విశ్వనాధపల్లి బానోత్ రవి, సింగరేణి ఇల్లంగి పిచ్చయ్య, ఉసిరికాయలపల్లి బానోత్ సరోజిని, మాధారం భూక్య రజని లను సర్పంచ్ అభ్యర్ధులుగా నిలుపుతున్నట్లు సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు మండల కార్యదర్శి కే.నరేంద్రలు తెలిపారు. బలం ఉన్న జీపీలలో అభ్యర్ధులను నిలపటం, భావసారూప్యతగల పార్టీలకు మద్దతు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో సీపీఐఎ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ జిల్లా కమిటీ సభ్యులు మెరుగు రమణ, నాయకులు వజ్జా రామారావు, కొండబోయిన ఉమావతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థల అధ్యక్షులుగా యర్రా సాయి ప్రవీణ్



**కారేపల్లి, డిసెంబర్ 02 (జనంసాక్షి) :** ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల సింగరేణి డివిజన్ కార్యదర్శిగా కారేపల్లి కి లిటిల్ స్టార్ స్కూల్ కరస్పాండెంట్ యర్రా సాయి ప్రవీణ్‌ను ఎన్నుకున్నారు. మంగళవారం లిటిల్ స్టార్ స్కూల్‌లో జరిగిన సమావేశం జరిగింది. ఈసమావేశంలో ప్రయివేట్ గుర్తింపు పొందిన పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా గుర్తింపు పొందిన విద్యాసంస్థల అధ్యక్షులు కాంతారావు మాట్లాడుతూ నిరుద్యోగులు ఉండి ఉపాధి అవకాశాలతో పాటు నాణ్యమైన విద్య అందిస్తున్నామని తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉండి ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకవెళ్లి పరిష్కరించుకుందామన్నారు. ఈకార్యక్రమంలో విద్వాన్ హైస్కూల్ కరస్పాండెంట్ జేమ్స్ చాకో, మాంటిస్సోరి కరస్పాండెంట్ మినీ జోజో, భాగ్యనగర్ స్కూల్ కరస్పాండెంట్ అరండకల్ మహేష్, కేవీ విద్యాలయం కరస్పాండెంట్ వాంకుడోత్ కోటేశ్వరరావు, బ్రిలియంట్ స్కూల్ కరస్పాండెంట్ మల్లెల నాగేశ్వరరావు, సరస్వతి స్కూల్ కరస్పాండెంట్ శేషు కూమార్ తదితరులు పాల్గొన్నారు.



# కర్ల రాజేష్ కుటుంబాన్ని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి



**నేరేడుచర్ల (జనంసాక్షి) :** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు నేరేడుచర్ల మండలంలోని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఆధ్వర్యంలో కర్ల రాజేష్ కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు నిరసన కార్యక్రమం చేపడతామని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ నేటి నుండి 10వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు చేపడతామని కర్ల రాజేష్ కుటుంబాన్ని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని చిలుకూరు ఎస్సైని, కోదాడ సిఐని తక్షణమే ప్రభుత్వం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యడవల్లి అరుణ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడవల్లి చంద్రయ్య మాదిగ, మండల నాయకులు కందుల రవి, ఒగ్గు యాకూబ్, పాత కోటి రత్న, ఎడవల్లి నాగరాజు, అభి, బాలయేసు, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

# శివాలయము హుండీ లెక్కింపు



**మేళ్లచెరువు, (జనంసాక్షి):**
మేళ్లచెరువు గ్రామంలో దక్షిణ కాశీగా వేంచేసియున్న శ్రీ స్వయంభు శుభలింగేశ్వర స్వామి దేవస్థానమునకు కార్తీక మాసంలో హుండీల ద్వారా వచ్చిన కానుకలను తెరిచి లెక్కించగా రూ. 2,30,054/-లు ఆదాయము వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి నాగేళ్ల శంబి రెడ్డీ తెలిపారు. పర్యవేక్షణ అధికారిగా దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కే. భాస్కర్ ఈ లెక్కింపులో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని అభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు, ఆలయ అధికారులు సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శాగంరెడ్డీ శంబిరెడ్డి, ధర్మకర్తలు కమతం శీను, సత్యనారాయణ రెడ్డి, వెంకటేశ్వర్లు, శంకర్, చిన్న పొంగు బాబు, శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్బంధాలతో గిరిజన ప్రజా ఉద్యమాలను ఆపలేరు

## సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు దరావత్ సురేష్ నాయక్

**టేకులపల్లి,డిసెంబర్ 2 (జనంసాక్షి):**
ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు వస్తున్నప్పుడు తమ సమస్యలను విన్నవించుకోవడానికి వెళ్ళనీయకుండాముందస్తుగా అక్రమ నిర్బంధాలతో పోలీస్ స్టేషన్లో అదుపులోకి తీసుకోవడం గిరిజన ప్రజా ఉద్యమాలను ఆపలేరని సేవాలాల్ సేన భద్రాద్రి జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో టేకులపల్లి పోలీస్ స్టేషన్ కు సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్, జిల్లా అధికార ప్రతినిధి బానోతు నాగరాజు నాయక్ ను ముందస్తు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపధ్యంలో అరెస్టు చేయడం సరికాదన్నారు. నిర్బంధాలతో గిరిజన ప్రజా ఉద్యమాలు అపలేరన్నారు. జిల్లాలో నెలకొన్న సమస్యలపై సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ముఖ్యమంత్రిని కలిసి జిల్లాలో ఉన్న సమస్యలను తెలుపుదామనుకుంటే ముందస్తు అరెస్టులు చేస్తున్నారని అన్నారు. జిల్లాలో ఎన్నో గిరిజన సమస్యలు ఉన్నప్పటికీ వాటిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లడంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్నటువంటి పలు ఎమ్మెల్యేలు కూడా విఫలమవుతున్నారని అన్నారు. జిల్లాకు సీతారామ ప్రాజెక్టు ద్వారా నీరు అందించకుండా పక్క జిల్లాలకు మళ్లిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు అన్యాయం చేస్తున్నారని, సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలకు తాగునీరు,సాగునీరు అందేలా చేయాలని అన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో క్యాన్సర్ హాస్పిటల్స్ స్థాపించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న కోల్ బెల్టు ఏరియాలో మణుగూరు, ఇల్లందు, కొత్తగూడెం కోయగూడెం మండలాలలో కోల్ బెల్టు ఏరియాల వల్ల దుమ్ము ధూళి గాలిలో నీటిలో తినే ఆహారంలో చేరి క్యాన్సర్ బారిన పడుతున్నారని, జిల్లా ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని జిల్లా కేంద్రంలో క్యాన్సర్ హాస్పిటల్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పోడు భూములకు పూర్తిస్థాయిలో సర్వే చేసి పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, జీవో నెంబర్ 3 స్థానంలో మరో జీవోను తీసుకువచ్చి ఈ రాష్ట్ర గిరిజన ప్రజలను ఆదుకోవాలని ఆయన తెలిపారు.






# అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వామి పల్లివేట ఉత్సవం

**మధిర, డిసెంబర్ 2 (జనంసాక్షి) :**
మధిర పట్టణంలోని లడక బజార్ అయ్యప్ప నగర్ లో వేంచేసి ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం అయ్యప్ప స్వామి పల్లివేట ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. గత నెల 26వ తేదీ నుండి ప్రారంభమైన ఉత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథం పై ఉంచి అయ్యప్ప స్వాములు భజనలు చేస్తూ ఘనంగా ఊరేగించారు. స్వామివారి ఆలయాన్ని నిర్మించి 18 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా పల్లి వేట కార్యక్రమంలో కేరళ నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన వాయిద్య బృందాలు, డీజే వాహనం కోలాట బృందాలు, మహిళలు, మాలదారులు స్వామివారి పాటలతో మధిర పురవీధులలో స్వామి వారి పల్లి వేట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వారి గ్రామోత్సవం సందర్భంగా స్థానిక లడక్ బజార్ దేశభక్తి యువజన సంఘం వారి ఆధ్వర్యంలో స్వామివారి ఆలయం వద్ద నుండి రైల్వే గేట్ వరకు మామిడి తోరణాలు కొబ్బరి ఆకులు అరటి అరటి బోదేలు కాషాయ త్వరణాలతో అందంగా అలంకరించారు. గ్రామోత్సవం అనంతరం తిరిగి స్వామివారి ఆలయం వద్దకు చేరుకున్న స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ మండపంలో ఉంచి పల్లికురుప్ప( శయ్య ) కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారితో పాటు మాలదారులు, భక్తులు ఆలయ మండపంలో నిద్ర చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక నిర్వాహకులు చలువది ధర్మారావు, చలువాది శ్రీనివాసరావు, దేవిశెట్టి రంగారావు, గురుస్వాములు వంకాయలపాటి వెంకట నాగేశ్వరరావు, బత్తుల శ్రీనివాసరావు, చెరుపల్లి శ్రీధర్, పాసికంటి గాంధీ, భాస్కర్ స్వామి తో పాటు పెద్ద ఎత్తున అయ్యప్పలు భక్తులు పాల్గొన్నారు.



# శ్రీకాంతచారి వర్ధంతిని పార్టీలకతీతంగా నిర్వహించాలి

## బీసీ జేఏసీ నాయకులు జింకల భాస్కర్

**నేరేడుచర్ల (జనంసాక్షి):**
తెలంగాణ రాష్ట్ర సాధనలో తొలి అమరుడు అయినటువంటి కాసోజు శ్రీకాంతాచారి వర్ధంతిని పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ఘనంగా నిర్వహించుకోవాలని బీసీ జేఏసీ నాయకులు జింకల భాస్కర్ కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో భాగంగా తను ఎల్బీనగర్ చౌరస్తాలో ఒంటిపై పెట్రోలు పోసుకొని జై తెలంగాణ అని పోరాడి డిసెంబర్ 3వ తేదీన మరణించారని. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి అమరుడైనటువంటి శ్రీకాంతచారి వర్ధంతిని ప్రభుత్వమే నిర్వహించాలని,ఆయన చేసిన త్యాగాన్ని ప్రభుత్వం గుర్తించి డిసెంబర్ 3న సెలవు దినంగా ప్రకటించి పాఠ్య పుస్తకాల్లో ముద్రించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయ నాయుడు, తెలంగాణ ఉద్యమకారుల వేదిక నియోజకవర్గ కన్వీనర్ రాపోలు నవీన్,బిసి సంఘం నాయకులు చిలకరాజు శ్రీను, ఆకుల జగతయ్య గౌడ్,కొమరాజు వెంకట్,గూడ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే

# కఠిన చర్యలు

## ఎస్సై రవీందర్ నాయక్



**నేరేడుచర్ల (జనంసాక్షి) :**
స్థానిక సంస్థల ఎన్నికలపై శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై రవీందర్ నాయక్ హెచ్చరించారు.మంగళవారం ఎస్సై రవీందర్ ప్రకటనలో తెలుపుతూ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఎవరైనా సోషల్ మీడియా ద్వారా సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత వ్యాఖ్యలు, రెచ్చగొట్టే పోస్టులను పెట్టి శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఏదైనా పోస్టులు, వీడియోలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఎవరి వ్యక్తిగత విషయాలపై పోస్టు చేయకుండా సిద్ధాంత పరంగా ఉండాలన్నారు.సోషల్ మీడియా మీద నిఘా ఉంటుందని, జాగ్రతగా వ్యవహరించాలని, ఎవరు కూడా భౌతికమైన దాడులకు దిగవద్దని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# గ్రామ అభివృద్దే తన లక్ష్యం

## ఇస్కిల్ల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి పైళ్ల చందన వెంకట్ రెడ్డి

**రామన్నపేట, డిసెంబర్ 2 (జనంసాక్షి):**



గ్రామ అభివృద్దే తన లక్ష్యమని, ప్రజలు ఇచ్చే విశ్వాసం, మద్దతు తో గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఇస్కిల్ల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిని పైళ్ల చందన వెంకట్ రెడ్డి తెలిపారు. గ్రామ ప్రజలతో కలిసి గ్రామ అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు.

# సర్పంచ్ గా ఆశీర్వదించండి బోగారం గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

## కూనూరు సాయికుమార్ గౌడ్ బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి

**రామన్నపేట, డిసెంబర్ 2 (జనంసాక్షి):**
రామన్నపేట మండలం బోగారం గ్రామ బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా కూనూరు సాయికుమార్ గౌడ్ మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి దిశలో తీసుకువెళ్తానని, ప్రజల కష్టసుఖాలు వెన్నంటి ఉంటానని ఒక అవకాశం ఇచ్చి చూడండి నా వంతు అభివృద్ధి చేస్తానని అన్నారు. నామినేషన్ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, గ్రామ పెద్దలు, యువత, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ప్రీ-మెట్రిక్ స్కాలర్షిప్ అవకాశం



**చండూరు మండలం డిసెంబర్ 2 (జనంసాక్షి)**
చండూరు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల కోసం ప్రీ-మెట్రిక్ స్కాలర్షిప్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని చండూరు ఎం.ఈ.ఓ ఊటుకూరు సుధాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం చండూరులో ఆయన మాట్లాడుతూ.. అర్హులైన విద్యార్థులు నిర్ణీత గడువులోగా అవసరమైన ధ్రువపత్రాలతో ఆన్లైన్లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉపయోగమన్నారు.

# ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

## చండూరు ఎస్ఐ

**చండూరు మండలం డిసెంబర్ 2 (జనం సాక్షి)**



స్థానిక సంస్థల ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చండూరు ఎస్ఐ వెంకన్న గౌడ్ హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రత్యేక్షంగా, పరోక్షంగా సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అసత్య ప్రచారాలు, మత విద్వేషాలకు సంబంధించిన పోస్టులు చేస్తే ఐటీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు.

# నిశ్శబ్దాన్ని చేదించాలి ఎయిడ్స్ పై అవగాహన కలిగి ఉండాలి : డాక్టర్ నవ్య కాంత్



**కల్లూరు డిసెంబర్ 02 (జనంసాక్షి)**
ఎయిడ్స్ మహమ్మారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ నిశ్శబ్దాన్ని చేదించి ఎయిడ్స్ నియంత్రణపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నవ్య కాం త్ స్పష్టం చేశారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో పేషెంట్లకు, వైద్య సిబ్బందికి, విద్యార్థులకు వైద్యధికారి డా. నవ్యకాంత్ ఎయిడ్స్ వ్యాధి నివారణ యొక్క ప్రాముఖ్యత గురించి వివరించడం జరిగినది. హెచ్ఐవి ఎయిడ్స్ అనేవి అపరిచిత వ్యక్తులతో జరిపే లైంగిక సంబంధాలు వల్ల అపరిచిత వ్యక్తులనుపరీక్షించని రక్త మార్పిడి వల్ల స్టెరిలైజ్ చేయని సిరంజీల వల్ల వ్యాధి సోకుతుందిఅని తెలిపారు. ఈ వ్యాధి రాకుండా ఉండాలంటే ప్రజలందరూ అప్రమత్తతో ఉండాలని అపరిచిత వ్యక్తులతో లైంగిక సంబంధాలు లేకుండా ఉండాలి , సరియైన రక్త పరీక్షా కేంద్రాల నుండి మాత్రమే రక్త మార్పిడి చేయించు కోవాలి అని సూచించారు అదేవిధంగామత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. ప్రతి గర్భిణీ స్త్రీ ఆమె భర్త తప్పకుండా రక్త పరీక్షలు చేయించుకోవాలి. అందువల్ల పుట్టబోయే బిడ్డకు ఎయిడ్స్ వ్యాధి రాకుండా ఉంటుందిఅన్నారు. ఎయిడ్స్ వ్యాధిని ద్వేషించాలి కానీ ఎయిడ్స్ రోగులను కాదు,రక్తదానం చేయాలి ప్రాణాలను కాపాడాలి,ఆరోగ్యమే మహాభాగ్యం, మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండాలి. అంటూ విద్యార్థులు వైద్య సిబ్బంది నినాదాలు చేశారుఈ కార్యక్రమంలో డాక్టర్ అఖిల,పల్లె ధవాఖాన వైద్యులు డా. వినీత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బి. ఎ. రాణి,హెల్త్ సూపర్వైజర్ రామారావు, వైద్యసిబ్బంది చార్లెస్, మేరీ మార్గరేట్,సుహాసిని, చంద్రలీల, అనూష, రవి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## ఏ పార్టీ సర్పంచ్ గెలిచిన.. ఓడిన..
# ఉపసర్పంచ్ బీజేపీ పార్టీకి?

### ఒకే పార్టీ ఇద్దరు అభ్యర్థులకు మద్దతు..
### రెండు వర్గాలుగా చీలిన తమ్మడపల్లి బిజెపి పార్టీ

**మర్రిగూడ, డిసెంబర్ 2 (జనంసాక్షి):** మర్రిగూడ మండలం లోని తమ్మడపల్లి గ్రామంలో బిజెపి పార్టీ రెండు వర్గాలుగా చీలి ఒక వర్గం బిఆర్ఎస్ పార్టీకి మరో వర్గం కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నాయి. సర్పంచ్ ఎన్నికలలో ఏ పార్టీ గెలిచిన ఉపసర్పంచ్ మాత్రం బిజెపి పార్టీకి వచ్చే విధంగా పదునైన వ్యూహాన్ని రచించిన బిజెపి పార్టీ. తమ్మడపల్లి గ్రామపంచాయతీలో 8 వార్డులు ఉన్నాయి. బిజెపి పార్టీ రెండు వర్గాలుగా చిలి ఒక వర్గం ఉప సర్పంచ్ పదవితోపాటు1,5,8 మూడు వార్డ్ నెంబర్లు ఇచ్చే విధంగా కాంగ్రెస్ పార్టీతో ఒప్పందం చేసుకున్నారు. మరో వర్గం బిఆర్ఎస్ పార్టీతో ఉప సర్పంచ్ పదవితో పాటు 1,7,8 మూడు వార్డులు తమకు ఇచ్చే విధంగా ఒప్పందం చేసుకున్నాయి,ఏ పార్టీ సర్పంచ్ గెలిచిన బిజెపి ఏ ఒక్క వార్డ్ మెంబర్ గెలిచిన ఉప సర్పంచ్ బిజెపికి ఇచ్చే విధంగా ఒప్పందం చేసుకోవడం మండల వ్యాప్తంగా చర్చనీ అంశంగా మారింది.

## మున్సిపాలిటీ కార్మికులు వేతనాల కొరకు నిరవధిక సమ్మె నోటీస్ అందజేత




**కల్లూరు డిసెంబర్ 02 (జనంసాక్షి):**
కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న.కార్మికుల వేతనాలు ఆరు నెలలుగా పెండింగ్లో ఉన్నాయని వేతనాల చెల్లింపు కొరకు నిర్వాధిక సమ్మె చేపట్టనున్నట్లు సమ్మె నోటీసులను మున్సిపాలిటీ మేనేజర్ నాగేశ్వరరావుకు ఏఐటియుసి ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం అందజేశారు.. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్మికులకు గత ఆరు నెలలుగా పెండింగ్ వేతనాలు 79 లక్షలు ఉండగా ఒక్కొక్కరికి 87000 రావాల్సి ఉంది కార్మికులు వేతనాలు రానందున అప్పుల పాలై కుటుంబాలు భారంగా మారాయని అన్నారు. గతంలో జిల్లా కలెక్టర్ ,సబ్ కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే లకు, వినతి పత్రాలు ద్వారా తెలియపరచిన కూడా స్పందన లేకపోవడంతో మంగళవారం నిరవధిక సమ్మెకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేయడం జరిగిందని తెలిపారు. ఈనెల 18వ తేదీ నుండి విధులు పూర్తిగా బహిష్కరిస్తూ సమ్మెకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దామాల దయాకర్ రావు జిల్లా నాయకులు మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఊడల కృష్ణమూర్తి కార్యదర్శి వజీర్మియా, ప్రకాష్, చింత పంటి శ్రీను, సుధాకర్, ప్రవీణ్ ,నరసింహారావు యశోద ,సీతమ్మ, చింతపల్లి శీను, బాబు గౌడ్ మణిరాజు చార్లెస్చి చిన్న లతోపాటు తదితరులు కార్మికులు పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా ప్రచారంలో దూసుకుపోతున్న సోయం కృష్ణవేణి



**చర్ల డిసెంబర్ 02 (జనంసాక్షి):**
చర్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీమతి సోయం కృష్ణవేణి ప్రచారంలో దూసుకుపోతుంది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరియు సిGCపిఎం పార్టీ తెలుగుదేశం పార్టీ మరియు చర్ల మండల ఆదివాసి జేఏసీ మద్దతు ప్రకటించిన సందర్భంగా ఈరోజు చర్ల సిపిఎం పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో సిపిఎం పార్టీ జిల్లా నాయకులు మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈనెల 11వ తారీకు జరగనున్న స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో చర్ల బిఆర్ఎస్ పార్టీ బలపర్చిన సోయం కృష్ణవేణి ని చర్ల మేజర్ గ్రామ పంచాయతీ లోని ఓటర్లు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు మాజీ మండల అధ్యక్షులు సోయం రాజారావు పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ మరియు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మచ్చ రామారావు బ్రహ్మచారి నవీన్ నాగ వర్మ చంటి సమ్మక్క తదితరులు పాల్గొన్నారు

# నేడు టీఆర్పీ ముఖ్య కార్యకర్తల సమావేశం

**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
తెలంగాణ రాజ్యాధికార పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని గాంధీనగర్ సమీపంలోని పెద్దమ్మ తల్లి ఫంక్షన్ హాల్ లో నేడు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంచార్జ్ వట్టె జానయ్య యాదవ్ సభాధ్యక్షులుగా జరిగే ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు,ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాల్గొని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్నట్లు తెలిపారు.సామాజిక న్యాయాన్ని కోరుకునే వారు, అట్టడుగు ప్రజల అభ్యున్నతిని ఆశించే వారు అందరూ, పార్టీ నాయకులు, కార్యకర్తలు తీన్మార్ మల్లన్న పాల్గొనే ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## లారీ ఢీకొని వస్త్ర వ్యాపారి మృతి



**ఖమ్మం రూరల్, డిసెంబర్ 02 (జనంసాక్షి)**
లారీ ఢీకొని వస్త్ర వ్యాపారి మృతి చెందిన సంఘటన ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని గుర్రాలపాడు వద్ద మంగళవారం చోటు చేసుకుంది.రూరల్ పోలీసులు తెలిపిన వివరాలప్రకారం ఖమ్మం పట్టణం,పంపింగ్ వెల్ రోడ్డుకు చెందిన కూరపాటి వెంకటేశ్వర్లు (66) ద్విచక్రవాహనంపై బట్టల వ్యాపారం చేస్తుంటాడు. ఖమ్మం నుండి వెంకటగిరి క్రాస్ రోడ్డు మీదుగా కోదాడ క్రాస్ రోడ్డు వైపు వెళుతుండగా గుర్రాలపాడు ప్రాంతంలోని గ్రానైట్ ఫ్యాక్టరీల వద్ద వెంకటేశ్వర్లు ద్విచక్రవాహనాన్ని లారీ అతి వేగంగా వచ్చి ఢీ కొట్టింది.ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు తల లారీ కింద పడటంతో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు.విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్ట నిమిత్తం ఖమ్మంప్రభుత్వ ఆసుపత్రికి తరలించి,కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు...

## శివాలయం హుండీ లెక్కింపు

**హుజూర్ నగర్, డిసెంబర్ 2 (జనంసాక్షి):**
పట్టణంలో వేంచేసియున్న శ్రీ పార్వతీ భీమలింగేశ్వర స్వామి ఆలయమునకు కార్తీక మాసంలో హుండీల ద్వారా వచ్చిన కానుకలను తెరిచి లెక్కించగా రూ. 75,958/-లు ఆదాయము వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. ఈ హుండీ ద్వారా వచ్చిన కానుకలు ఒక నెల 15 రోజులవని తెలిపారు. ఈ లెక్కింపులో చిన్నం సురేష్, కంచర్ల శ్రీనివాస్ రెడ్డి, పసునూరి శ్రీనివాస్, పొనుగుబాటి అశోక్, బల్లునూరి క్రాంతి రెడ్డి, పారేపల్లి సత్యనారాయణ, అర్చకులు రెంటాల శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని శ్రీ సీతారామ చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం ఆంజనేయ స్వామి, శివ స్వాములకు, భక్తులకు చందంపేట విద్యుత్ శాఖ ఏఈ పెద్దిశెట్టి వసంత్ కుమార్ సింధు దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి మహా అన్నదాన వితరణ చేశారు. అనంతరం స్వాములు వారిని శాలువాతో సన్మానం చేసి ఆశీస్సులు అందచేశారు ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పెద్దిశెట్టి కృష్ణయ్య అంజమ్మ దంపతులు స్వాములు కొండల్, శ్రీనివాస్, వెంకటేష్, రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**జనంసాక్షి, కొండమల్లేపల్లి.**

# తాళ్లచెరువులో కాంగ్రెస్ అభ్యర్థి గడిపూడి వీరభద్రం గెలుపు ఖాయం

## కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తాయి

**తిరుమలాయపాలెం, డిసెంబర్ 02, (జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజల కోసం రాష్ట్ర శ్రేయస్ కోసం అనునిత్యం కృషి చేస్తున్నారని పేద ప్రజల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం వేలాదికోట్ల రూపాయలను ఖర్చు చేస్తుందని తాళ్ళచెరువు కాంగ్రెస్ సర్పంచి అభ్యర్థి గడిపూడి వీరభద్రం అన్నారు. తాళ్ళచెరువు గ్రామపంచాయతీ కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాలేరు శాసనసభ్యులు రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాలేరు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కోట్ల రూపాయలు నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నారని గ్రామాలలో అంతర్గత సిసి రోడ్లు బిటి రోడ్లు సైడ్ కాలువలు నిర్మాణం ఇందిరమ్మ ఇల్లు మహిళలకు ఉచిత బస్సు పావలా వడ్డీ రుణాలు సన్న బియ్యం రైతు భరోసా ఉచిత గ్యాస్ భూ సమస్యల పరిష్కారానికి భూభారతి తో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థిని విద్యార్థులకు సైకిల్ పంపిణీ విద్యార్థుల కాళ్లకు షూ పిఎస్ఆర్ ట్రస్టు ద్వారా అందిస్తున్నారని ఆయన తెలిపారు అభివృద్ధి చేసే కాంగ్రెస్ పార్టీ సర్పంచి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. తాళ్ల చెరువులో సర్పంచ్ గా గెలిపిస్తే గత ప్రభుత్వం చేయలేని ఎప్పటి నుండో పెండింగ్లో ఉన్న గ్రామంలో ప్రధాన సిసి రోడ్డును నిర్మిస్తామని సైడ్ కాలువలు శాశ్వతంగా పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. గ్రామంలో ప్రజల అవసరాలు తీర్చే మౌలిక వసతులు కల్పిస్తామని అన్నారు. గ్రామ ప్రజలంతా మంచి మనసుతో నన్ను ఆశీర్వదించాలని కాంగ్రెస్ అభ్యర్థి గడిపూడి వీరభద్రం తాళ్ళచెరువు గ్రామ ప్రజలను కోరారు.



## అన్ని దానాల కంటే అన్నదానం మిన్న

**మధిర, డిసెంబర్ 2 (జనంసాక్షి):** అన్ని దానాల కంటే అన్నదానం మిన్న అని మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగా హనుమంతరావు అన్నారు. మంగళవారం ఆతుకూరు ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ప్రతి మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. రంగా హనుమంతరావు, మధులత, మండవ కిషోర్, వెంకటలక్ష్మి వారి ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని రంగ రాఘవ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదవాడి ఆకలి తీర్చే విధంగా ప్రతి ప్రతి మంగళవారం ఆత్కూరు ఆంజనేయ స్వామి వద్ద దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేయటం అభినందనీయ మన్నారు. ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమంలో పాల్గొనాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఆడంబరాలకు మితిమీరి ఖర్చులు చేయకుండా పేదల ఆకలి తీర్చే విధంగా అన్నదానాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో దాతలు భక్తులు పాల్గొన్నారు.






అశ్వరావుపేట మండల కేంద్రంలో టీవీ9 రిపోర్టర్ కొల్లు రవి కిరణ్ తండ్రి కొల్లు కోలాజర్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు. ఈ క్రమంలో అశ్వరావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ భౌతికకాయాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్, చెన్నకేశవరావు తదితరులు నాయకులు పాల్గొన్నారు.

**అశ్వరావుపేట జనంసాక్షి**



## 9 న జరిగే ఐక్య క్రిస్మస్ సంబరాలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఆహ్వానం

**కల్లూరు డిసెంబర్ 02 (జనం సాక్షి)** కల్లూరులో డిసెంబర్ 9న జరిగే ఐక్య క్రిస్మస్ సంబరాలకు తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని ఆహ్వానిస్తూ ఇండిపెండెంట్ అసోసియేషన్ క్రిస్టియన్ కమిటీ అధ్యక్షులు ఎనోష్ కుమార్ పలువురు క్రైస్తవ సోదరులతో కలిసి మంత్రి స్వగ్రామం నారాయణపురంలో ఆహ్వాన పత్రాన్ని మంగళవారంఅందజేశారు. ఈ సందర్భంగా ఎనోష్ కుమార్ మాట్లాడుతూ ఐక్య క్రిస్మస్ సంబరాలకు అంతర్జాతీయ సువార్తికులు యంగ్ హెూలీ టీం వ్యవస్థాపకులు డాక్టర్ జాన్ వెస్లీ రానున్నారనీ తెలిపారు. క్రైస్తవ సోదరులు ప్రేమ పూర్వక ఆహ్వానాన్ని అందించడంతో మంత్రి పొంగులేటి సానుకూలంగా స్పందించి క్రిస్మస్ సంబరాలకు వస్తానని చెప్పడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి నిర్మల్ కుమార్, దాసరి డేవిడ్ రాజు, టి ఎబినేజర్, పెరుమాళ్ళ దయాకర్, మోదుగు జాన్ పరంజ్యోతి, తేల్లూరి సంజీవరావు, సమర్పణ పాల్, తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

## భగవద్గీత శ్లోక పఠన పోటీలలో విజయకేతనం ఎగరవేసిన శ్రీనిధి విద్యార్థులు




**మధిర, డిసెంబర్ 02 (జనంసాక్షి):** ఖమ్మం జిల్లా మధిర పట్టణంలోని సీతారామచంద్రస్వామి వారి దేవాలయ ప్రాంగణంలో గీతా పరిషత్ ఆధ్వర్యంలో గీతా జయంతి సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన గీత శ్లోక పఠన పోటీలలో మధిర శ్రీనిధి స్కూల్ విద్యార్థులు అన్నీ విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సీనియర్స్ విభాగంలో ప్రథమ,ద్వితీయ స్థానం జూనియర్స్ విభాగంలో తృతీయ స్థానం సాధించడం జరిగింది. ఈ సందర్భంగా బహుమతులు సాధించిన విద్యార్థులను ముదిగొండ విశ్వేశ్వర శాస్త్రి,గడ్డమునుగు శ్రీనివాసరావు, గీతా పరిషత్ సభ్యులు ప్రత్యేకంగా అభినందించి బహుమతులను అందజేశారు. అనంతరం మంగళవారం పాఠశాల ప్రాంగణంలో జరిగిన అభినందన సభలో శ్రీనిధి విద్యా సంస్థల కరస్పాండెంట్ అంజన బాబు,డైరెక్టర్ చందు ఆధ్వర్యంలో విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జ్ డి.శ్రీనివాసరావు,తెలుగు ఉపాధ్యాయులు నాగరాజు,ఇతర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

మధిర, డిసెంబర్ 02 (జనంసాక్షి): మధిర పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు, మధిర టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ మిర్యాల వెంకటరమణ గుప్తా సతీమణి లావణ్య పుట్టినరోజు సందర్భంగా మధిర ఆర్కే ఫౌండేషన్ అనాధాశ్రమం, మదర్ థెరిసా వికలాంగుల సేవాసదనము నందు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది. ఎంతో డబ్బు ఖర్చుపెట్టి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకుంటున్న ఈ రోజుల్లో ఆ డబ్బుతో బీదవారికి, అనాధలకు వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేయడం పట్ల పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సేవా కార్యక్రమాన్ని అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా శ్ లావణ్య కి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.



## జోరుగా నామినేషన్లు



**చంద్రుగొండ, డిసెంబర్ 2 (జనంసాక్షి):** చంద్రుగొండ మండలంలో మంగళవారం జోరుగా నామినేషన్ ప్రక్రియ సాయంత్రమైనా కొనసాగుతూనే ఉంది. మంగళవారం మంచి గడియలు అని అన్ని పార్టీల వారు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లకు రావడంతో ఆయా నామినేషన్ల కేంద్రాల వద్ద సందడి నెలకొంది. రాత్రి 10 గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగే అవకాశం ఉండడంతో పూర్తిస్థాయిలో సమాచారం అందలేదు. ప్రతి పార్టీ నుంచి ఒక్కో వార్డుకు రెండు నామినేషన్లు వేస్తున్నారు. నామినేషన్ల విత్ డ్రా అనంతరమే బరిలో ఎవరెవరు ఉంటారనేది స్పష్టంగా తెలుస్తుంది.



## తిమ్మకపేట ఏకగ్రీవ సర్పంచ్ గా సుభద్ర

**తిరుమలాయపాలెం, (జనంసాక్షి):** మండల పరిధిలోని తిమ్మకపేట గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి రేపాకుల సుభద్ర ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. గ్రామంలో అందరి రాజకీయ నాయకుల ప్రమేయంతో ఏకాభిప్రాయంతో సర్పంచి అభ్యర్థిని వివిధ రాజకీయ పార్టీ నాయకులు మంగళవారం ప్రకటించారు. సుభద్ర భర్త మాజీ ఎంపీటీసీ. ఈయన ప్రజాపంథా సీనియర్ జిల్లా నాయకులు. తిమ్మకపేట గ్రామంలో కాంగ్రెస్, బిఆర్ఎస్, ప్రజా పంథా మాస్ లైన్ పార్టీల నాయకుల అభిప్రాయం, ప్రజల అభీష్టం మేరకు ఏకగ్రీవం గా ఆమె ఎన్నికయ్యారు. తిరుమలాయపాలెం మండలంలో మొత్తం 40 గ్రామ పంచాయతీల పరిధిలో మొదటి గా తిమ్మక్కపేట సర్పంచిగా తిమ్మకపేట గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. సర్పంచ్ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న రేపాకుల సుభద్ర గ్రామ ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ గ్రామ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.

